సాక్షి
మెదక్

మంగళవారం । 5 । ఆగస్టు । 2025



సాగు పాఠాలు

విద్యార్థులు క్షేత్రస్థాయిలో సాగు పనులను పరిశీలిస్తూ కొత్త పద్ధతులు తెలుసుకుంటున్నారు. వివరాలు 8లో ▸



37 లక్షల మొక్కలు నాటుతాం

జిల్లాలో 37 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ణయించామని డీఆర్‌డీఓ శ్రీనివాస్ తెలిపారు. వివరాలు 8లో ▸

సింగూరుకు వరద

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతుంది. సోమవారం ప్రాజెక్టులోకి 1211 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 20.663 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి వరద పెరుగుతుండటంతో పర్యాటకులు సందడి పెరిగింది.

న్యూస్‌రీల్

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి

కార్యకర్తలకు జగ్గారెడ్డి పిలుపు



కొండాపూర్(సంగారెడ్డి): స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ కార్యకర్తలు సిద్ధం కావాలని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధి మల్కాపూర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గంలో ఎంపీపీలతో పాటు మున్సిపల్‌లో కూడా కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలన్నారు. మరో 8 ఏళ్ల రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటుందని, పేదల సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి అనేక పథకాలను ప్రవేశపెడుతున్నారని తెలిపారు. 10 ఏళ్ల లో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని నాశనం చేసిందన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ రాంరెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కుమార్, ఎంపీటీసీ నరసింహారెడ్డి, నాయకులు వెంకటేశంగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నరసింహులు, ప్రభుదాస్, మల్లారెడ్డి, సునీల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు ఉద్యమం



చర్లపల్లి రైల్వేస్టేషన్‌లో ఆంజనేయులుగౌడ్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం టీపీసీసీ ఉద్యమం చేపట్టిందని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఢిల్లీలో చేపట్టిన మూడు రోజుల ఉద్యమంలో పాల్గొనేందుకు సోమవారం జిల్లాకు చెందిన పార్టీ నాయకులతో కలిసి వెళ్లారు. కాగా బీసీలకు కాంగ్రెస్ హయాంలోనే న్యాయం జరుగుతుందని, 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు.

డిప్లొమాలో అవకాశం

మెదక్‌జోన్: పదో తరగతి పాసైన విద్యార్థినులు ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో చేరాలనుకుంటే ఎలాంటి ఎంట్రెన్స్ రాయకున్నా నేరుగా డిప్లొమాలో చేరవచ్చని మెదక్ ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ భవాని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్, సివిల్ ఇంజనీర్ మూడు కోర్సులు ఉన్నాయని తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు కళాశాలలో నేరుగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



సభ్యత్వాలను చూపుతున్న ఉపాధ్యాయులు

హవేళిఘణాపూర్(మెదక్): పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని జక్కన్నపేట, రాజ్‌పేట, సర్దన, కూచన్‌పల్లిలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 జులై 1 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీ, రెండేళ్లు గడిచినా నివేదికలు వెలువరించకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, రఘుబాబు, సంతోష్, లక్ష్మీకాంతం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సిగాచీ బాధితులను ఆదుకోండి: సీఐటీయూ

సంగారెడ్డి ఎడ్యుకేషన్: సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మృతిచెందిన కార్మిక కుటుంబాలను తక్షణమే ఆదుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో బాధిత కార్మిక కుటుంబ సభ్యులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ.. ప్రమాదం జరిగి నెల రోజులు దాటినా బాధిత కుటుంబాలకు న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే పూర్తి నష్టపరిహారం చెల్లించడంతో పాటు యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తెచ్చి పోరాడుతామని హెచ్చరించారు. దీక్షలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మల్లేశం, జిల్లా కార్యదర్శులు జయరాజ్, సాయిలు, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, నాయకులు మాణిక్యం, పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పరికరాలు

- చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు
- జిల్లాలో 1,076 కేంద్రాలు
- 50 వేల మంది విద్యార్థులు
- బలోపేతం కానున్న ప్రీ స్కూల్ విద్య

అంగన్‌వాడీలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా కేంద్రాల్లోని చిన్నారులను ఆకట్టుకునే విధంగా పలు రకాల వసతుల కల్పనకు పెద్దపీట వేసింది. ఈ మేరకు కేంద్రాలకు 60 రకాల పరికరాలు, రంగు రంగుల మ్యాట్లు, టేబుళ్లు పంపిణీ చేసింది. కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యా విధానాన్ని మెరుగుపరిచే దిశగా మాతా, శిశు సంక్షేమశాఖ కృషి చేస్తుంది.

– రామాయంపేట(మెదక్)



రామాయంపేట అంగన్‌వాడీలో చదువు చెబుతున్న టీచర్

సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ విద్యా విధానాన్ని మెరుగుపర్చడం కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది. ఇందులో భాగంగానే కేంద్రాలకు 60 రకాల పరికరాలు, ఆట వస్తువులు, టేబుళ్లు, మ్యాట్లు పంపిణీ చేశారు. వీటిని కేంద్రాల్లో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

– హైమావతి, జిల్లా సంక్షేమాధికారిణి

జిల్లా పరిధిలో 21 మండలాల్లో మొత్తం 1,076 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 50 వేల పైచిలుకు విద్యార్థులున్నారు. కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేక చిన్నారులు ఇబ్బందులపాలవుతున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో నేలపై కూర్చొని ఆహారం తీసుకుంటున్నారు. దీంతో వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉండటంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. అన్ని కేంద్రాలకు మౌలిక సదుపాయాలు కల్పించి, వాటిని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తుంది. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని అన్ని కేంద్రాలకు రంగు రంగుల మ్యాట్లతో పాటు టేబుళ్లు, ప్రీ స్కూల్ కిట్లు, పుస్తకాలు పెట్టుకోవడానికి వీలుగా ర్యాక్‌లతో పాటు 60 రకాల పరికరాలు పంపిణీ చేశారు. కేంద్రాల్లోని చిన్నారులను మ్యాట్లపై కూర్చొబెట్టి చదువు చెబుతున్నారు. వారు ఒకే చోట కూర్చొని అల్పాహారం చేసేలా ప్రత్యేకంగా ప్రతి కేంద్రానికి రెండు టేబుళ్లు సరఫరా చేశారు. స్కూల్ కిట్‌లో కథలకు సంబంధించి చిన్న చిన్న బొమ్మల పుస్తకాలతో పాటు ఆటలు ఆడుకోవడానికి వీలుగా సామగ్రి అందించారు. పుస్తకాల ర్యాక్, నాలుగు ప్రియదర్శిని పుస్తకాలు, బ్లూటూత్, ఫజిల్స్, వివిధ చార్టులు, వాటర్ కలర్స్ బ్రష్‌లతో పాటు పలు రకాల పండ్ల బొమ్మలు అందజేశారు. చిన్నారులను నేలపై కాకుండా మ్యాట్లపై మాత్రమే కూర్చొబెట్టాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాగా తాము కేంద్రాలకు మంజూరు చేసిన పరికరాలు వినియోగిస్తున్నారా..? లేదా అనే విషయమై పర్యవేక్షించేందుకు మ్యాట్లపై చిన్నారులను ఉంచి ప్రతి రోజు యాప్‌లో ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సత్వరమే అర్జీలు పరిష్కరించండి

- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ప్రజావాణికి 111 దరఖాస్తులు

మెదక్ కలెక్టరేట్: ప్రజలు మనపై నమ్మకంతో అర్జీలు అందజేస్తున్నారు.. వెంట వెంటనే పరిష్కరించి సమాధానం ఇవ్వాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు 111 వినతులు అందజేశారు. ఇందులో అత్యధికంగా భూ సమస్యలపై 32, పెన్షన్ల కోసం 12, ఇందిరమ్మ ఇళ్ల 12, ఇతర సమస్యలపై 57 దరఖాస్తులు అందజేయగా, కలెక్టర్ స్వీకరించి మాట్లాడారు. అధికారులు సానుకూలంగా స్పందించి దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేశ్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ శ్రీనివాసరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. నేటి నుంచి జిల్లాలో చేపట్టే ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్‌ను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వెల్దుర్తి(తూప్రాన్): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మాసాయిపేటలోని పలు కాలనీల్లో ఆకస్మికంగా పర్యటించారు. పలు నివాసాల వద్ద నీటి తొట్లు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటిని గుర్తించి సిబ్బందిచే పారబోయించారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- 7న మెదక్‌లో పెద్దఎత్తున ధర్నా
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి



మాట్లాడుతున్న పద్మారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజాపాలన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పార్టీ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ అమలు కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని, తర్వాత హామీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరు సమైక్యాంధ్ర పాలనను గుర్తు తెస్తుందన్నారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించారన్నారు. దీనిని నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ఈనెల 7న పార్టీ తరఫున పెద్దఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లాలో సగటు వర్షపాతం నమోదు కాక రైతులు ఆకాశం వైపు చూస్తుంటే, అటు సింగూరు, ఇటు కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని విడుదల చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న చోట ఒకవిధంగా, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మరోవిధంగా ప్రొటోకాల్ పాటించడం విచారకరమన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమంగా మారుస్తున్న అధికార పార్టీ నాయకుల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ హేమలత, సీనియర్ నాయకులు తిరుపతిరెడ్డి, చంద్రాగౌడ్, మెదక్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కృష్ణాగౌడ్, మాజీ జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్, భూపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ హరికృష్ణ, రాజశేఖర్‌గౌడ్, శ్రవణ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ వలలో విద్యావంతులే అధికం

ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మెదక్ మున్సిపాలిటీ: సైబర్ నేరగాళ్ల వలలో విద్యావంతులే అధికంగా ఉంటున్నారని, ఉచితం, ఎక్కువ లాభం అంటే మోసం అని గ్రహించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలో ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయన్నారు. ఆశ, భయం, మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. బ్యాంకు అధికారులమని ఫోన్ చేస్తే నమ్మవద్దని, అనుమానం ఉంటే సంబంధిత బ్యాంకు అధికారులను సంప్రదించాలని సూచించారు.

16 ఫిర్యాదులు

జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో సోమవారం ఎస్పీ జిల్లాస్థాయి ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 16 సమస్యలపై ఫిర్యాదులు అందజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీరయ్య

కార్మికుల హక్కులపై కేంద్రం దాడి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య

తూప్రాన్: బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులపై దాడి చేస్తుందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య ఆరోపించారు. సోమవారం పట్టణంలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం ఆధ్వర్యంలో 'లేబర్ కోడ్స్- కార్మికులపై ప్రభావం' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని అన్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ జీఓ విడుదల చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం సీఐటీయూ మెదక్ జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ..జిల్లాలో మొదటిసారిగా సీఐటీయూ రాష్ట్ర 5వ మహాసభలు డిసెంబర్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్య క్రమంలో ఆహ్వాన సంఘం వైస్ చైర్మన్ అడివయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/కంగ్టి/కల్హేర్: పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో పేదలకు రేషన్ కార్డులు, ఇళ్లు ఇవ్వలేదని, పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. కంగ్టిలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇన్నాళ్లు రేషన్ కార్డులు లేక పేదలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో బేస్‌మెంట్ పూర్తిచేసిన వారికి చెక్కులు పంపిణీ చేశారు. అలాగే కల్హేర్ మండలం సిర్గాపూర్‌లో లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశారు. మండలంలోని కృష్ణాపూర్ వద్ద నల్లవాగు కాల్వలో పూడిక తీత, చెట్ల పొదల తొలగింపు పనులను పరిశీలించారు. నల్లవాగు ప్రాజెక్టు నిండితే కాల్వల ద్వారా సాగు నీటి సరఫరాకు ఆటంకం లేకుండా పూడిక తీత పనులు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ఖేడ్‌లో గొల్లకురుమ సంఘం నియోజకవర్గ, మండలాల నూతన కార్యవర్గాలను అభినందించారు. నియోజకవర్గంలోని గొల్లకురుమల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట అధికారులు, నాయకులు ఉన్నారు.



కంగ్టిలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

అమ్మాయిలకు అండగా షీటీం

డీఎస్పీ నరేందర్‌గౌడ్



మాట్లాడుతున్న తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్

చేగుంట(తూప్రాన్): చదువుకునే అమ్మాయిలకు రక్షణగా షీటీం పోలీసులు పనిచేస్తారని తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ అన్నారు. చేగుంట మోడల్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. ఆకతాయిల వేధింపులను అరికట్టడానికి షీటీం పోలీసులు కృషి చేస్తారన్నారు. అధికంగా డబ్బులు వస్తాయని ఫోన్‌లలో వచ్చే ప్రకటనలు నమ్మి మోసపోవద్దని చెప్పారు. యువతను మత్తు పదార్థాలు డ్రగ్స్ పెడదారి పట్టేలా చేస్తాయని, వాటి నివారణ కోసం కృషి చేయాలన్నారు. అమ్మాయిలను వేధించే విషయంలో పోక్సో చట్టం గురించి వివరించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నతంగా ఎదిగితే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు సంతోషిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేగుంట ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రకళ, షీటీం సభ్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగుకు చెక్

గ్రామాల్లో డ్రైనేజీ చివర సోక్‌పిట్ల నిర్మాణం

గ్రామాల్లో మురుగునీటిని వృథాగా వదిలేస్తుండటంతో గ్రామచివరి నివాసితులు దుర్గంధం, దోమలతో ఇబ్బంది పడుతూ రోగాల పాలవుతున్నారు. దీంతో వృథాగా పోతున్న మురుగునీటికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నడుంబిగించింది. అందులోభాగంగా గ్రామాల్లోని డ్రైనేజీ చివరి పాయింట్‌లో సోక్‌పిట్లను నిర్మించాలని నిర్ణయించింది. స్వచ్ఛ భారత్ మిషన్(ఎస్‌బీఎం), ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద ఉమ్మడి మెదక్ జిల్లాకు 1,510 సోక్‌పిట్లు మంజూరు చేసింది. వీటి నిర్మాణం కోసం స్థలాలు వెదికే పనిలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిమగ్నమయ్యారు.

- ఉమ్మడి మెదక్ జిల్లాకు 1,510 మంజూరు
- గ్రామాల్లో నిర్మించేందుకు ముందుకు వచ్చేనా?

జిల్లా	ఎస్‌బీ		ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్ మొత్తం
మెదక్	441	49	490
సిద్దిపేట	403	51	454
సంగారెడ్డి	503	63	566



సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్ పంట పొలాల్లోకి చేరుతున్న డ్రైనేజీ నీరు

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో 1,633 గ్రామ పంచాయతీలుండగా అందులో 1,510 గ్రామాల్లో టెయిలెండ్ సోక్‌పిట్లను నిర్మించనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు 1,510 టెయిలెండ్ సోక్‌పిట్లు మంజూరు కాగా, ఎస్‌బీఎం ఆధ్వర్యంలో 1,347, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో 163 నిర్మించనున్నారు. ఒక్కో సోక్‌పిట్ నిర్మాణానికి రూ. 92,747 నిధుల చొప్పున రూ 14,00,47,970 వ్యయంతో నిర్మించనున్నారు. ఎస్‌బీఎం ఆధ్వర్యంలో నిర్మించే వాటికి 70% నిధులతో, గ్రామ పంచాయతీ 30%, 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించనున్నారు. అయితే ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో మంజూరైన మొత్తం సోక్‌పిట్లను ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతోనే నిర్మించనున్నారు.

మురికినీటిని వృథాగా వదిలేస్తుండటంతోనే

గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు నిర్మించారు. కానీ, మురికి నీటిని గ్రామం చివర చెరువుల్లో, ఖాళీ స్థలాల్లో పొలాల్లోకి వృథాగా వదిలేస్తున్నారు. దీంతో పల్లెల్లో చివరి నివాసితులు దోమలు, దుర్వాసనలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విష జ్వరాలు, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి రోగాల బారిన పడుతున్నారు. పలు చోట్ల వీటితో మరణించిన ఘటనలున్నాయి. వీటికి చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

ముందుకు వచ్చేనా?

గ్రామ పంచాయతీల్లో పాలకవర్గం లేకపోవడంతో సోక్‌పిట్లను నిర్మించేందుకు ముందుకు ఎవరొస్తారనే చర్చ అధికారుల్లో సాగుతోంది. ఎవరూ ముందుకు రాకపోతే నిధులు వెనక్కి వెళ్లి పోయే అవకాశం ఉండటంతో సోక్‌పిట్ల నిర్మాణం కోసం టెండర్లు పిలిచి నిర్మాణం పనులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు. అలాగే కొన్ని చోట్ల స్థల సమస్య సైతం తలెత్తే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని వీటిని నిర్మాణం చేపడితే గ్రామం చివర ఉండే వారి ఇబ్బందులు తప్పనున్నాయి.

“ స్థలాలు గుర్తిస్తున్నాం

గ్రామాల్లో టెయిలెండ్ సోక్‌పిట్ల నిర్మాణం కోసం స్థలాలు గుర్తిస్తున్నాం. అక్టోబర్ చివరి నాటికి నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించాం. వీటి నిర్మాణంతో కొంత వరకు దోమలు, దుర్వాసనను నియంత్రించవచ్చు.

– జయదేవ్‌ఆర్యా, డీఆర్‌డీఏ, సిద్దిపేట ”

క్లుప్తంగా

లాంగ్ జంప్‌లో సాయితేజకు పతకం


సాయి తేజతో జావిద్ అలీ

సంగారెడ్డి: హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగిన 11వ తెలంగాణ అథ్లెటిక్ క్రీడల్లో భాగంగా లాంగ్ జంప్ విభాగంలో అండర్ -16లో సంగారెడ్డి జిల్లాకు చెందిన కె.సాయి తేజ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా అతడికి జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండి జావిద్ అలీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. మిగిలిన క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి జిల్లాకు మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

గోవా మద్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు

మునిపల్లి(అందోల్): భారీ ఎత్తున గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ శంకర్ తెలిపారు. సోమవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా వివిధ రకాల బ్రాండ్లకు సంబంధించిన గోవా మద్యం దొరికింది. మొత్తం 34 బాటిళ్లలో 14.850 లీటర్ల గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ అనుదీప్, వినారెడ్డి, నజీర్‌పాషాతో పాటు సిబ్బంది ఉన్నారు.

గంజాయి స్వాధీనం..

పటాన్‌చెరు టౌన్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసిన ఘటన ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ పరమేశ్వర్ గౌడ్ వివరాల ప్రకారం... జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు రామచంద్రపురంలో సోమవారం దాడులు నిర్వహించారు. కంజర్ల రమేశ్, దినేశ్‌ల నుంచి 385 గ్రాముల గంజాయి, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

కాపర్ వైర్ చోరీ


ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి, కాపర్ వైర్‌ను ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మండలంలోని కట్కూర్ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు ఇలా... గ్రామానికి చెందిన కొలుగూరి వెంకట్‌రెడ్డి పొలం వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ వైర్‌ను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. గుర్తించిన పలువురు రైతులు విషయాన్ని ట్రాన్స్‌కో అధికారులకు చెప్పారు. వారు వచ్చి ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో దాదాపు 10ఎకరాల్లో ఆదివారం వరి నాట్లు చేశారు. దీంతో రైతులు పొలానికి నీరు ఎలా పారించాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మందుబాబులకు జరిమాన

సంగారెడ్డి క్రైమ్ / సిద్దిపేటకమాన్ / పటాన్‌చెరు టౌన్: ఉమ్మడి జిల్లాలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడ్డ వాహనదారులకు జిల్లా న్యాయస్థానాలు జరిమాన విధించాయి. సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన డ్రంకన్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 11మందిని జిల్లా న్యాయస్థానంలో హాజరుపరచగా అదనపు న్యాయమూర్తి షకీల్ అహ్మద్ సిద్దిఖీ ఆరు మందికి రూ.2వేలు, ఇద్దరికి రూ.1500, మిగతా ముగ్గురికి రూ.వెయ్యి చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో 11మంది పట్టుబడ్డారని టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.18వేల జరిమాన, ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష, బహిరంగ ప్రదేశంలో మద్యం తాగుతూ పట్టుబడిన నలుగురికి రూ.6వేల జరిమాన విధించినట్లు తెలిపారు. పటాన్‌చెరు పట్టణంలో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 22 మందిని పట్టుకున్నట్లు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ చెప్పారు. సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 21 మందికి రూ. వెయ్యి చొప్పున, మరో వ్యక్తికి రూ. 2 వేలు జరిమాన విధించినట్లు పేర్కొన్నారు.

ఆటోడ్రైవర్‌కు రెండు రోజుల జైలు

కౌడిపల్లి(నర్సాపూర్): మద్యం తాగా ఆటోనడిపిన డ్రైవర్‌కు నర్సాపూర్ కోర్టు జైలుశిక్ష విధించింది. ఎస్ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఈనెల 2వ తేదీన పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేస్తుండగా మెదక్ పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ జహంగీర్ మద్యం తాగి ఆటోనడుపుతూ పట్టుబడ్డాడు. సోమవారం నర్సాపూర్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి హేమలత రెండు రోజులు జైలుశిక్ష విధించగా, జహంగీర్‌ను కంది జైలుకు తరలించారు.

క్షేత్రస్థాయిలో.. సాగు పాఠాలు

- గ్రామీణ కృషి అనుభవంలో వ్యవసాయ విద్యార్థులు
- కేవీకే శాస్త్రవేత్త రవికుమార్ ఆధ్వర్యంలో అవగాహన


రైతులతో కలిసి నాటు వేస్తున్న విద్యార్థులు

తరగతి గదిలో నేర్చుకునే విద్యతోపాటు, క్షేత్రస్థాయిలో సాగు పనులను పరిశీలిస్తూ ఆ పనులు చేయడంతో ఎక్కువ అవగాహన కలుగుతుంది. మల్లారెడ్డి యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్ నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తాము నేర్చుకుంటున్న సబ్జెక్ట్‌పై క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన పొందుతున్నారు. గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా మండలంలోని శీలాంపల్లి గ్రామంలో వ్యవసాయ పనులు నేర్చుకుంటున్నారు. తాము తరగతి గదిలో చదువుకున్న విషయాలు రైతులకు తెలియజేస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం తునికి వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులు తమ అనుభవాలను రైతులకు వివరిస్తున్నారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్):


శీలాంపల్లి రైతులకు తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న మల్లారెడ్డి వ్యవసాయ విద్యార్థులు

సాగు విధానాల పరిశీలన..

గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా క్షేత్రస్థాయిలో విద్యార్థులు ప్రాజెక్ట్ మూడు నెలలు చేయాల్సి ఉండగా, నెలన్నర సమయం పూర్తయింది. ఈ సమయంలో వారు రైతులతో కలిసి వరినాట్లు వేయడం, పత్తి సాగులో మెలుకువలు, సాంకేతిక వ్యవసాయంలో భాగంగా డ్రోన్ల వినియోగం, సేంద్రీయ పద్ధతిలో వరి, మునగ సాగును పరిశీలిస్తున్నారు. వరికోత పూర్తికాగానే, కొయ్యకాళ్లలో మొక్కజొన్న సాగు చేసే పద్ధతులను నేర్చుకుంటున్నారు. అలాగే రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించి, భూసారానికి అనుకూలమైన పంటలు సాగుచేయాలని అవగాహన కల్పిస్తున్నారు.

రైతులకు సూచనలు...

భూసార పరీక్షలకు కావాల్సిన మట్టిని, నేల నుంచి ఏ విధంగా సేకరించాలో ప్రయోగాత్మకంగా రైతులకు వివరించారు. పత్తికి సోకిన చీడపీడల గురించి వివరించి, వాటి నివారణకు చర్యలు సూచించారు. వరి, ఇతర పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. రైతు నారువేసే సమయం నుంచి, పైరు కోసే వరకు ఏ సమయంలో ఏ పనులు చేయాలి? ముఖ్యంగా పురుగు మందులు పిచికారీ సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే పద్ధతులను వివరిస్తున్నారు. గ్రామాల రైతులు ప్రత్యామ్నాయ పంటల దిశగా మొగ్గు చూపకుండా, ఎక్కువగా వరి సాగుకే ఆసక్తి చూపుతున్నారని, పంటమార్పిడి చేసేలా సైతం విద్యార్థులు సూచిస్తున్నారు. గ్రామంలో కనీసం 15 మంది రైతులు తప్పనిసరిగా సేంద్రీయ వ్యవసాయం చేసేలా అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపు గ్రామ రైతుల నుంచి వ్యవసాయంలో పూర్తి సమాచారం తెలుసుకోవడంతోపాటు, తాము నేర్చుకున్న విషయాలను రైతులకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

సేంద్రీయ సాగుపై అవగాహన



రైతులు తమ ఆరోగ్య ప్రయోజనాలను, నేల సారాన్ని కాపాడుకునేందుకు తప్పనిసరిగా ఉన్న భూమిలో కొంతవరకైనా సేంద్రీయ వ్యవసాయం చేయాలి. తమ ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపు కనీసం కొంత మంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేసే విధంగా కృషి చేస్తా. ప్రాజెక్ట్‌లో భాగంగా మేము రైతులకు తెలియజేసిన విషయాల కంటే, మేము వారి ద్వారా ఎక్కువ విషయాలు నేర్చుకున్నాం.

– టి.అక్షయ, అగ్రికల్చర్ విద్యార్థి, మల్లారెడ్డి యూనివర్సిటీ

రైతుల సహకారం బాగుంది



గ్రామీణ కృషి అనుభవంలో భాగంగా శీలాంపల్లి గ్రామ రైతుల సహకారం బాగుంది. ఈ ప్రాజెక్ట్‌లో నేర్చుకున్న విషయాలు మాకు ఎంతగానో ఉపయోగపడతాయి. రైతులతో కలిసి చేసిన వ్యవసాయ పనులు మర్చిపోలేనివి. ప్రాజెక్ట్ పూర్తయ్యేలోపు గ్రామరైతుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకుంటా. తరగతిలో నేను నేర్చుకున్న పాఠాలు రైతులకు క్షుణ్ణంగా వివరిస్తా.

– ఎస్.అశ్వినికుమారి, అగ్రికల్చర్ విద్యార్థి, మల్లారెడ్డి యూనివర్సిటీ

37లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం

డీఆర్‌డీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): జిల్లాలో వన మహోత్సవం సందర్భంగా వర్షాకాలంలో 37లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా నిర్ణయించామని డీఆర్‌డీఓ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామ పంచాయతీని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం నర్సరీని పరిశీలించి మాట్లాడారు. జిల్లాలో వివిధ శాఖల పరిధిలో 37లక్షల మొక్కలు నాటడం లక్ష్యం కాగా ఇందులో ఉపాధిహామీ పథకం ద్వారా 25లక్షలు నాటేందుకు నిర్ణయించామన్నారు. కాగా ఇప్పటివరకు యాభైశాతం మొక్కలు నాటినట్లు తెలిపారు. త్వరలో అన్ని గ్రామాల్లో అవసరమైన పండ్లు, పూలు, ఇతర మొక్కలను ఇంటింటికీ పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో యాభైవేల మంది ఆసరా పింఛన్ లబ్ధిదారులకు ఫేస్ రికగ్నిషన్ ద్వారా పంపిణీ చేస్తున్నామని, తొంభైశాతం పూర్తి అయిందన్నారు. పింఛన్ డబ్బులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ఈసీ ప్రేమ్‌కుమార్, కారోబార్ ఎల్లం తదితరులు పాల్గొన్నారు.


వన నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

గేదె తాడు అడ్డురావడంతో..

- బైక్ అదుపుతప్పి కిందపడిన దంపతులు
- భర్త మృతి..భార్యకు గాయాలు


రాజేశం

దుబ్బాక: రోడు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు గాయాలయ్యాయి. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ కీర్తి రాజు వివరాల మేరకు... మండలంలోని రాజక్కపేటకు చెందిన ముదిగొండ రాజేశం(55) గ్రామంలో కిరాణదుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో తన భార్య చంద్రకళతో దుబ్బాకకు కిరాణసామగ్రి కోసం వెళ్లారు. ఆదివారం సాయంత్రం సామాను తీసుకొని బైక్‌పై భార్యాభర్తలు స్వగ్రామానికి వస్తున్న క్రమంలో చెల్లాపూర్ శివారులో రోడ్డుప్రక్కన కట్టేసిన గేదె తాడు అడ్డువచ్చి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో రాజేశం తలకు తీవ్రగాయం కావడంతోపాటు చంద్రకళకు గాయాలయ్యాయి. వీరిని ఆస్పత్రికి తరలించగా రాజేశం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్ యశోద ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కూరగాయలు తీసుకొస్తుండగా మహిళ..


బాలమణి

దుబ్బాకరూరల్: బైక్ ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ ఘటన అక్బర్‌పేటభూంపల్లి మండలం చిట్టాపూర్‌లో జరిగింది. ఎస్ఐ హరీశ్ వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గుజ్జెటి బాలమణి(58) ఆదివారం సాయంత్రం గ్రామ చౌరస్తాలో కూరగాయలు కొనుగోలు చేసుకుని ఇంటికి వస్తుంది. ఈ క్రమంలో బైక్‌పై సిద్దిపేట వైపు నుంచి రామాయంపేటకు వెళుతున్న రఘునందన్ అతి వేగంగా, అజాగ్రత్తగా వచ్చి మహిళను ఢీకొట్టాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. సిద్దిపేట ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా బైకిస్టుది మెదక్ జిల్లా నిజాంపేట మండలం తిప్పనుగుల్ల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బావ, బామ్మర్ది..


రాజ్‌కుమార్


సందీప్

గజ్వేల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో బావ, బామ్మర్ది మృతి చెందారు. ఈ ఘటన గజ్వేల్ మున్సిపాల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ శివారులో గల రాణే కంపెనీ ఎదుట ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన రంగయ్య కూతురు సంధ్యను మిరుదొడ్డి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌కు ఇచ్చి ఏడాదిన్నర క్రితం వివాహం జరిపించారు. సంధ్య, రాజ్‌కుమార్ దంపతులు ఉపాధి కోసం వెళ్లి మేడ్చల్ పరిధిలోని కేఎల్‌ఆర్ కమాన్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. కాగా, సంధ్య అమ్మమ్మగారి గ్రామమైన యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం జరిగిన బోనాల పండుగకు వెళ్లారు. అదే రోజు సాయంత్రం రాజ్‌కుమార్ అత్తగారి గ్రామమైన కోనాపూర్‌కు బస్సులో చేరుకున్నారు. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో బావ రాజ్‌కుమార్‌ను మేడ్చల్‌లో దింపడానికి బామ్మర్ది సందీప్ కారులో బయలుదేరారు. వీరు ప్రజ్ఞాపూర్ నుంచి హైదరాబాద్ మార్గంలో వెళుతుండగా రాజీవ్ రాహదారిపై రాణే కంపెనీ ఎదుట ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాజ్‌కుమార్, సందీప్ తీవ్ర గాయాలై దుర్మరణం చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కూతురిని కడతేర్చేందుకు యత్నించిన తండ్రి

నర్సాపూర్ రూరల్: కన్న కూతురును కడతేర్చేందుకు ప్రయత్నించిన ఓ కసాయి తండ్రి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన మండలంలోని అచ్చంపేటలో జరిగింది. ఎస్సై లింగం వివరాల ప్రకారం... తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన శ్రీరామ్ ప్రశాంత్‌కు కొన్నేళ్ల క్రితం అచ్చంపేట గ్రామానికి చెందిన ఇందుతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుర్లు రుతిక, రియాన్షిక ఉన్నారు. ఆరు నెలల క్రితం భార్యభర్తల మధ్య సంసారం విషయంలో గొడవ జరిగింది. దీంతో ఇందు ఇద్దరు కూతుళ్లతో పుట్టింటికి వెళ్లిపోయింది. ప్రశాంత్ ఆదివారం అచ్చంపేటలోని భార్యాపిల్లల వద్దకు వెళ్లి చిన్న కూతురు తనకు పుట్టలేదని భార్యతో గొడవ పెట్టుకుని రియాన్షికను పైకిఎత్తి సీసీ రోడ్డుపై పడేశాడు. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో మొదట నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా ప్రాణాలతో కొట్టుమిట్టాడుతోంది. ఇందు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పరారీలో ముగ్గురు

చిన్నశంకరంపేట(మెదక్): పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్ట్ చేయగా, మరో ముగ్గురు పరారయ్యారు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... గవ్వలపల్లి చౌరస్తాలోని రైతువేదిక వెనక ఏడుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా ఆదివారం రాత్రి దాడి చేసి పట్టుకున్నారు. గొల్ల బాబు, రమావత్ ప్రభాకర్, యోద్దు నందా, శ్రీరామ్ వేణులను అదుపులోకి తీసుకోగా, కుమార్, శంకర్, మస్కూరి కేశవులు తప్పించుకున్నారు. నగదు, పేకాట ముక్కలు, ఫోన్లు, ఇన్నోవా కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కొల్చారంలో 9 మంది..

కొల్చారం(నర్సాపూర్): పేకాట రాయుళ్లను సోమవారం మెదక్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మండలంలోని రంగంపేట గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్పీ శ్రీనివాస రావు వివరాల ప్రకారం... విశ్వసనీయ సమాచారం మేరకు గ్రామంలోని ఓ తోటలో పేకాట ఆడుతుండటంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 9 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.32, 206ల నగదు,7 సెల్‌ఫోన్లు, 4 ద్విచక్ర వాహనాలన స్వాధీనం చేసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రంలోని పరిశ్రమల సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... మండల శివారులోని జీకే వైర్స్ కంపెనీ సమీపంలో నాగ సిద్దవ్వకు చెందిన బీడు భూమిలో పొదల్లో గుర్తుతెలియని వ్యక్తి(40) మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గ్రామ కార్యదర్శి ప్రదీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు పంచనామా నిర్వహించి, మృతదేహన్ని పోస్ట్‌మార్టం కోసం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మతిస్థిమితంలేని వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు.

తండ్రికి పక్షవాతం రావడంతో..

కూతురు ఆత్మహత్య


జ్యోతి

నిజాంపేట(మెదక్): తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండటంతో మనస్తాపం చెందిన కూతురు ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల పరిధిలోని నార్లాపూర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గాలం లక్ష్మణ్, మంజుల దంపతుల పెద్ద కూతురు జ్యోతి(24)ని కామారెడ్డి జిల్లాలోని ఉప్పరిపల్లికి చెందిన బోడ్డు స్వామికి ఇచ్చి ఏడాది క్రితం వివాహం చేశారు. మూడు నెలల క్రితం తండ్రికి పక్షవాతం రావడంతో జ్యోతి తల్లిగారి ఇంటి వద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటుంది. ఈ క్రమంలో తండ్రి అనారోగ్యంతో బాధపడుతుండటంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం ఇంట్లో చీరతో ఉరి వేసుకుంది. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మిక చట్టాలను విస్మరిస్తున్న యాజమాన్యం

సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాజయ్య


మాట్లాడుతున్న రాజయ్య

పటాన్‌చెరు టౌన్: కార్మిక చట్టాలను పరిశ్రమల యజమాన్యాలు విస్మరిస్తున్నాయని యూనియన్ అధ్యక్షుడు, సీఐటీయూ రాష్ట్ర నాయకులు రాజయ్య అన్నారు. సోమవారం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధి పాశమైలారంలోని సువెన్ ఫార్మా పరిశ్రమ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఫార్మా యాజమాన్యం కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నదని ఆరోపించారు. కార్మికులను ఉత్పత్తిలో నేరుగా పని చేయించుకోవడం తప్పని అన్నారు. అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్యం, పరిశ్రమ యూనియన్ నాయకులు వెంకటేశ్, చంద్రయ్య, శ్రీనివాస్, ప్రభు, రాజు, మల్లేశ్, లక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం


కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ

నర్సాపూర్ రూరల్: బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మహా సంపర్క్ అభియాన్ మెదక్ జిల్లా ఇన్‌చార్జి జయశ్రీ, అన్నారు. సోమవారం మండలంలోని గూడెంగడ్డలో జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేశ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికి కరపత్రాలు, డోర్ స్టిక్కర్లు అంటించి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్ యాదవ్, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రమేశ్ గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ రమణారావు, పెద్ద రమేశ్ గౌడ్, సంగసాని సురేశ్, రాజేందర్, శంకర్, నగేశ్, బాలరాజ్, మల్లిక, రాజు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక లాభాలు

కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాస్


రైతులకు సేంద్రియ ఎరువులు, స్ప్రే పంపులను పంపిణీ చేస్తున్న రవికుమార్

కొల్చారం(నర్సాపూర్): పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా అధిక లాభాలు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం తునికి ఉద్యాన శాస్త్రవేత్త శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలోని గిరిజన రైతులకు సేంద్రీయ ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రసాయన ఎరువుల వాడకం వల్ల భూమిలో భూసారం తగ్గుతుందన్నారు. తెగుళ్లు, వివిధ రకాల మొగిపురుగులు ఆశించి పంట నష్టం జరుగుతుందన్నారు. విరివిగా దొరికే పశువుల ఎరువులను పొలాలకు ఉపయోగించడం ద్వారా భూమిలో సారం పెరిగి పంట దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం సేంద్రియ పదార్థాలతో చేసిన మందులు, స్ప్రే పంపులను గిరిజన రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర తునికి ఉద్యాన శాస్త్రవేత్త రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

భూ భారతి ద్వారా పట్టాదార్ పాస్‌బుక్

ఆనందంలో లబ్ధిదారురాలు

సాక్షి ఎఫెక్ట్..

మెదక్ కలెక్టరేట్: గత మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన పదేళ్లుగా తిరుగుతున్నా.. అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు సోమవారం జరిగిన ప్రజావాణిలో లబ్ధిదారురాలు తాటికొండ లక్ష్మికి భూ భారతి ద్వారా పట్టాదార్ పాస్‌బుక్ అందజేశారు. తన మూడెకరాల భూమికి పట్టాదార్ పాస్ పుస్తకం కోసం పదేళ్లుగా తిరుగుతున్నా పరిష్కరించడం లేదని చేగుంట మండలం చందంపేటకు చెందిన తాటికొండ లక్ష్మి ప్రజావాణిలో ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఆమెకు పట్టాదార్ పాస్‌బుక్ అందజేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు.


ఆనందంలో తాటికొండ లక్ష్మి

మెడికల్ కోడింగ్‌లో ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

- నేషనల్ గైడర్స్ ఫర్ మెడికల్ కోడర్స్‌తో ఎంఓయూ
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత

సిద్దిపేట ఎడ్యుకేషన్: బయోటెక్నాలజీ విభాగంలో డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు మెడికల్ కోడింగ్‌లో వారం రోజుల పాటు ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణను అందజేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, నేషనల్ గైడర్స్ ఫర్ మెడికల్ కోడర్స్ ఫౌండర్స్ కార్తీక్‌కుమార్ వెల్లడించారు. సోమవారం కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ నేషనల్ గైడర్స్ ఫర్ మెడికల్ కోడర్స్ మధ్య ఐదేళ్లకు అవగాహన ఒప్పందం కుదిరిందని వీరు తెలిపారు.అనంతరం విద్యార్థులను ఉద్యోగ అవకాశాలకు సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బయోటెక్నాలజీ విభాగాధిపతి రోహిని, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, బయోటెక్నాలజీ అధ్యాపకులు వేణు, ఎన్ఎస్‌ఎస్ ప్రతినిధులు పవన్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.